అనుమతి లేకుండా రోడ్డు తవ్వేశారు


రోడ్డును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకటేష్ గోత్రె

బంజారాహిల్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు వెచ్చించి వేసిన రోడ్డును ఓ అపార్ట్‌మెంట్ మంచినీటిపైప్ లైన్ కోసం తవ్వేసి వదిలేశారు. దీంతో రోడ్డు ప్రమాదాలు పెరగడంతో జీహెచ్ఎంసి జోనల్ కమిషనర్ స్పందించి పనులు చేపట్టిన ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లో వాసవి కన్‌స్ట్రక్షన్స్ భారీ నిర్మాణాలు చేపడుతోంది. ఈ అపార్ట్‌మెంట్ కోసం మంచినీటి పైప్‌లైన్ పనులను ఓ ఏజెన్సీకి అప్పగించింది. అయితే ఏజెన్సీ నిర్వాహకులు జీహెచ్ఎంసి అనుమతి లేకుండా సీఆర్ఎంపీ నిధులతో వేసిన రోడ్డును తవ్వేశారు. గోతులను అలాగే వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. విషయం తెలుసుకున్న జోనల్ కమిషనర్ వెంకటేష్‌గాత్రె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు రిస్టోరేషన్ చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ భారీ జరిమానా వేయనున్నట్టు తెలిపారు.


త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

బంజారాహిల్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. గణపతిని సేవింపరారే.. గంధము పూయరా వంటి త్యాగరాజ కీర్తలను చిన్నారులు ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

● పంజాగుట్ట: విజ్ఞాన సమితి వేద వేదాంత సంగీత సాహిత్య ప్రచారసభ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ అనంద్‌నగర్ కమ్యూనిటీ హాలులో త్యాగరాజ ఆరాధనోత్సవాలు, విజ్ఞాన సమితి సంగీతోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం విద్వాన్ డీవీ మోహనకృష్ణ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలను గానం చేశారు. సంగీత విద్వాంసుల స్వల్ప వ్యవధి కచేరీలు ఆకట్టుకున్నాయి.


డైరీ, క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

గ్రామస్థాయిలో వైద్య వ్యవస్థ ఉండాలి

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరికీ వైద్యం అందాలంటే గ్రామస్థాయిలో వైద్య వ్యవస్థ ఉండాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ) అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్గం మోహన్, ఉపాధ్యక్షుడు డి.లక్ష్మీరాజాం, రవివర్మ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌లతో కలిసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను వినడానికి ప్రజా ప్రభుత్వం వచ్చిందని, సమస్యలు ఏమైనా ఉంటే కూర్చుని మాట్లాడి పరిష్కరించుకునే అవకాశం వచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గ్రామ, బస్తీ స్థాయిలో ప్రజలకు వైద్యం అందించేది పీఎంపీ, ఆర్ఎంపీలేనని, ప్రాథమిక చికిత్స దొరుకుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ ఫిలిం చాంబర్ నాయకులు విజయేందర్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా కోశాధికారి పోషాద్రి, రాములు, జితేందర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

యాన్యువల్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

సనత్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఖాళీ సమయంలో ఫోన్‌లో మునిగిపోకుండా క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల గౌరవవందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, విద్యా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

పాఠశాలలు నిర్మించాలని సీఎంకు వినతి

ఖైరతాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని కార్పొరేటర్ విజయారెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం పలువురు కార్పొరేటర్లతో కలిసి స్కూల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. అదే సమయంలో నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. నియోజకవర్గానికి చెందిన చింతలబస్తీ, ఉదయ్‌నగర్‌కాలనీ, ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన స్థలాల్లో స్కూళ్లను నిర్మింపజేయాలని కోరారు. ఈ స్థలాలపై కొందరి కన్ను పడిందని, అవి కబ్జా కాకుండా కాపాడాలని కోరారు.

'పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయండి'

ఖైరతాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం ఖైరతాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు మిద్దె కృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పారిశుధ్య కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయమై అధికారులకు, సంబంధిత మంత్రులకు, ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

బైక్, ల్యాప్‌టాప్ చోరీ

యూసుఫ్‌గూడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో రెండు బైక్‌లు, ల్యాప్‌టాప్ చోరీ జరిగాయి. ఈ సంఘటనలు మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. జీడిమెట్లకు చెందిన ఎం.శక్తీశ్వరావు ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. ఈనెల 29వతేదీ యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద తన బైక్ పార్కు చేసి హోటల్‌లో బిర్యానీ తిని వచ్చేసరికి పార్కు చేసిన అతడి బైక్ కనిపించలేదు. అదే విధంగా ప్రకాశం జిల్లాకు చెందిన ఓ.గోపీకృష్ణ 29వతేదీన ఎల్లారెడ్డిగూడలోని తన స్నేహితుడి హాస్టల్‌కు వచ్చి రాత్రి అక్కడే ఉన్నాడు. తెల్లవారుజామున 7 గంటలకు చూడగా ఆ హాస్టల్ ఎదుట పార్కు చేసిన తన బైక్ కనిపించలేదు. మరో కేసులో నున్నా చైతన్యకుమార్ ఎల్లారెడ్డిగూడలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 28వ తేదీన ల్యాప్‌టాప్‌ను గదిలో పెట్టి భోజనం కోసం బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన ల్యాప్‌టాప్ కనిపించలేదు. దీంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టిన యువకులు

కార్మికనగర్‌లో నివసించే అర్జున్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఐతే ఈనెల 28వ తేదీ రాత్రి తన భార్యను తీసుకురావటానికి ద్విచక్రవాహనంపై అమీర్‌పేట బీఎస్ఎన్ కార్యాలయం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో పంజాగుట్ట నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు అర్జున్ బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టారు. దీంతో అర్జున్‌కు గాయాలయ్యాయి ఆసుపత్రిలో చికిత్స అనంతరం మధురానగర్ పోలీసులకు అర్జున్ ఫిర్యాదు చేశాడు.

మూగజీవులకు ఆపన్నహస్తం

● గాయపడిన వీధి కుక్కలకు చికిత్స ● పక్షులను కాపాడుతున్న వలంటీర్లు ● వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేస్తే స్పందిస్తారు

బంజారాహిల్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దెబ్బతగిలి రక్తం వస్తున్నా బయటకు చెప్పలేని మూగజీవులవి. నొప్పి కలిగినా.. జ్వరం వచ్చినా.. ఓ మూలన పడుకుంటాయి. ఎవరినీ ఇబ్బంది పెట్టవు. ఇలాంటి మూగజీవుల కష్టం తెలుసుకుంటారు వారు. అంతటితో ఆగరు అవసరాన్ని బట్టి మూగజీవులకు చికిత్స చేసి కోలుకునే దాకా సపర్యలు చేస్తారు. మంచి ఆహారం ఇచ్చి సంరక్షిస్తారు. కోలుకున్నాక వాటి ప్రపంచంలోకి వదులుతారు. రోడ్డు మీద గాయాలతో ఉన్న మూగజీవుల గురించి ఎవరైనా సమాచారం ఇస్తే చాలు క్షణాల్లో అక్కడకు వెళ్లి వాటిని తీసుకెళ్లి చికిత్స అందిస్తారు. మూగజీవులకు ఇబ్బంది కలిగిందంటే వీరు విలవిలాడిపోతారు. వాటిని తిరిగి మామూలు స్థితికి తీసుకొచ్చే వరకూ తగిన జాగ్రత్తలు తీసుకుంటారు పీపుల్స్ ఫర్ యానిమల్స్ సంస్థ ప్రతినిధులు.

అన్నీ తామై..

మూగ జీవులు గాయాల బారిన పడ్డాయని సమాచారం అందిన వెంటనే పీపుల్స్ ఫర్ యానిమల్స్ ప్రతినిధులు అక్కడికి చేరుకుంటారు. జంతువు పరిస్థితిని అంచనా వేసి వాటికి ఎటువంటి అపాయం కలుగకుండా జాగ్రత్తగా తమ వాహనాల్లోకి తరలిస్తారు. గాయపడ్డ కుక్కను చూసిన వలంటీర్లు తమతో తెచ్చుకున్న కుక్కలను తీసుకుపోయే వాహనాలను దూరం పెడతారు. పది నుంచి ఇరవై నిమిషాల పాటు సాధారణంగా ఉంటూ తమతో తెచ్చుకున్న వలలో చిక్కుకునేలా చేస్తారు. ప్రేమగా దగ్గరకు తీసుకొని వాటికి భయం పోయిందని నిశ్చయించుకున్నాక వాహనంలోకి ఎక్కిస్తారు. తమ ఆస్పత్రికి తీసుకువెళ్లి ట్రీట్‌మెంట్ చేస్తారు. వీధి కుక్కలే అధికంగా గాయపడి కనిపిస్తుంటాయని, వాటిని బయటకు పంపించేటప్పుడు పూర్తి వాక్సినేషన్ చేసి పంపిస్తారు. వైద్య అందించాక మూగ జీవాలకు పౌష్టికాహారం పెడుతూ అవి కోలుకునే దాకా జాగ్రత్తగా చూసుకుంటారు ఈ సంస్థ ప్రతినిధులు.

ప్రైవేటు వైద్యులు సైతం

తమ ముందు మూగజీవులకు ఏం జరిగినా తట్టుకోలేరు ప్రైవేటు క్లీనిక్ వైద్యులు. లాభం ఆశించకుండా వీధి కుక్కలను ఎవరు తీసుకొచ్చినా ఉచితంగా చికిత్స అందిస్తారు. అవి కోలుకునే వరకు తమ వద్దే ఉంచుకుంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో సుమారు 15 గాయపడిన జంతువులకు ప్రైవేటు వైద్యులే చికిత్స అందించారు.


మాంజాకు చిక్కుకొని గాయపడ్డ పక్షి


శునకాలకు ఆహారం అందిస్తున్న వలంటీర్లు

మానవత్వం స్పందిస్తోంది

రోడ్డున వెళ్లేటప్పుడు గాయపడ్డ మూగజీవాలను చూస్తుంటాం. కానీ వాటికి వైద్యం చేయించడం గురించి పట్టించుకోం. కానీ ఇప్పుడు నగర వాసుల్లో ఈ ధోరణి తగ్గుతోంది. గాయపడిన మూగజీవాల కోసం ఏదైనా చేయాలనే తాపత్రయం యువకుల్లో కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం కేబీఆర్ పార్క్ వద్ద రెండు శునకాలు పోట్లాడాయి. ఈ ప్రమాదంలో కుక్కలు గాయమయింది. వాకింగ్‌కు వచ్చిన ఇద్దరు యువకులు పీపుల్స్ ఫర్ యానిమల్స్ సంస్థకు ఫిర్యాదు చేశారు. ప్రతినిధులు వచ్చే వరకు అక్కడే ఉండి శునకాన్ని అప్పగించి వెళ్లారు.

వీధి కుక్కలను లెక్కిస్తారు

వీధి కుక్కలపై కొంత మంది కర్కశంగా ప్రవర్తిస్తారు. అవి కరుస్తాయేమోనని భయంతో రాళ్లతో దాడి చేస్తుంటారు. కాని దీన్ని వల్ల శునక జాతి అంతం అయిపోతుందని వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను పట్టుకొని కుటుంబనియంత్రణ ఆపరేషన్‌లు చేస్తుంటారు. అనంతరం వాటి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతుంటారు. దీన్ని వల్ల శునకాలను ఎవరైన దొంగలించినా, చంపినా వెంటనే తమకు తెలిసిపోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు యానిమల్ సంస్థ ప్రతినిధులు.

వీధి కుక్కల పట్ల ప్రేమగా ఉండాలి

వీధి కుక్కల పట్ల ప్రేమగా ఉండాలి. అవి కనబడగానే కొంత మంది రాళ్లు, కర్రలతో దాడులు చేస్తుంటారు. మూగజీవులను హింసించడం మంచిది కాదు. ఎక్కడైనా గాయపడిన జంతువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పెట్స్ క్లీనిక్‌కు తీసుకువెళ్లండి. చాలా మంది ప్రైవేటు వైద్యులు వీధి కుక్కలకు ఉచితంగా చికిత్స చేస్తున్నారు.

- డాక్టర్ జస్కీన్‌కౌర్, పెట్స్ సర్జన్

● **ఘనంగా హోమం**



ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో నిర్వహించిన మహా కుంభాబిషేకం, శతచండీ హోమంలో తెలంగాణ గెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్, దేవాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారి దర్శించుకున్నారు.
-సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

● **గాంధీకి నివాళి**



బీజేజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలు ముందు ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు రామేశ్వరం గోవిందు, రమేష్, రవి, తదితరులు
- అమీర్‌పేట, ఆంధ్రజ్యోతి

రేపటి నుంచి హరికథా మహోత్సవం

రవీంద్రభారతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కళాపోషకుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హరికథా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మద్దాళి రఘురామ్ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నగరంలోని నల్లకుంట శృంగేరి మఠం వేదికగా ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మొదటి రోజు డా.సప్పాభారతి శివలీలలు హరికథాగానం, తార్వత రోజుల్లో ఎద్రా శ్రీనివాస్ - గజేంద్రమోక్షం, ఆర్.రేఖ - వినాయక విజయం, మడమల రాంబాబు - మహా కవికాళీదాసు, జల్దా విశ్వనాథ జయరాములు - శ్రీనివా కళ్యాణం, జె.జె.నారాయణ - భక్త మార్కండేయ, గరిమెళ్ల సత్యవతి చే సీతారామ కళ్యాణం హరికథాగానం చేయనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు హరికథాగానం ప్రారంభమవుతుందని రఘురామ్ తెలిపారు.

పశ్చిమ మండలంలో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీ

బంజారాహిల్స్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మండలంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మధురానగర్, బోరబండ, సంజీవరెడ్డినగర్ ఇన్‌స్పెక్టర్‌లకు స్థాన చలనం జరిగింది. నెల రోజులుగా ఖాళీగా ఉన్న పంజాగుట్ట స్థానాన్ని కూడా భర్తీ చేశారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్ ఐజీపికి సర్వీసెస్‌ను సరెండర్ చేయమన్నారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌ను సంజీవరెడ్డినగర్‌కు బదిలీ చేసి ఐటీ సెల్‌లో ఉన్న రాఘవేంద్రకు పోస్టింగ్ ఇచ్చారు. సంజీవరెడ్డినగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామ ప్రసాద్‌ను సీటీసీకి పంపించారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణను ఐజీపికి సర్వీసెస్‌ను సరెండర్ చేయమని మేకల శ్రీనివాస్‌కు పోస్టింగ్ ఇచ్చారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాదన్నపేట్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో సైదులకు పోస్టింగ్ ఇచ్చారు. బోరబండ ఇన్‌స్పెక్టర్ విజయ్‌ను బదిలీ చేసి ఆదిరెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. ఇకనెల రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి కేసులో సస్పెండ్ అయిన దుర్గారావు స్థానంలో బి.శోభన్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

బీఆర్‌టీయూ నుంచి బహిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి30 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ)కు అనుబంధంగా ఉన్న వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ నుంచి అసోసియేట్ అధ్యక్షుడిగా ఉన్న కె.రాజ్‌రెడ్డి, మహ్మద్ జహంగీర్‌లను బహిష్కరిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు జీ.రాంబాబుయాదవ్ మంగళవారం ప్రకటించారు. వీరిద్దరూ యూనియన్ వ్యతిరేక కార్యక్రమాలకు చేపట్టడంతో పాటు గ్రూపులు కడుతూ అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయా కారణాలరీత్యా యూనియన్ పదవులను నుంచి తొలగిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి


మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల కాంతం హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకుడు డాక్టర్ సంజీవ్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు దోచుకొన్నారని ఆరోపించారు. ప్రజలు కలిసికట్టుగా పోరాటం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ పేరు మీద పార్టీ పెట్టుకుని పబ్బం గడిపి పదవులు అనుభవించారన్నారు.


మాట్లాడుతున్న గడ్డం శ్రీరామ్

సురేందర్‌కు న్యాయం చేయాలి

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం సమయంలో పోలీస్ శిక్షణలో జై తెలంగాణ అంటూ నినాదం చేసి ఉద్యోగం పోగొట్టుకున్న జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఉద్యమకారుడు ఎస్.సురేందర్‌కు న్యాయం చేయాలని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ జనరల్ స్టూడెంట్ జేఏసీ (ఓయూ) అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తనతో పాటు సురేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివాడని, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడన్నారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లో వెలువడిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై కర్నూలులో శిక్షణ పొందుతున్న సమయంలో జై తెలంగాణ అంటూ నినాదాలు చేయడంతో అధికారుల ఆగ్రహానికి గురై ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం, మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులకు ఎన్ని లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సురేందర్‌కు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ విమల్‌కుమార్, నాయకులు సుధీర్, గోపి, శివ, వెంకటేష్, అమరేందర్, మహేష్, రాధం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'గోల్డ్ రేటింగ్‌తో తమ బాధ్యతలు మరింత పెరిగాయి'

మోతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన లీడ్ గోల్డ్ రేటింగ్ పొందడం ద్వారా తమ సంస్థ వెస్టిన్ హైదరాబాద్ హైటెక్ సిటీకి బాధ్యతలు మరింత పెరిగాయని వెస్టిన్ హైదరాబాద్ మైండ్ స్పేస్ జనరల్ మేనేజర్ దీప్‌ప్రీత్ బింద్రాకు అన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా వెస్టిన్ హైదరాబాద్ హైటెక్ సిటీలో మంగళవారం ఆయన మాట్లాడారు. మహిళలతో నూటికి నూరు శాతం పునరుత్పాదక శక్తి, ప్రకృతి వైవిధ్యంతో కూడిన నిర్వహణ ద్వారా తమకు ఈ అవార్డు సాధించగలగామన్నారు. ఈ అవార్డును ఆగ్నేయాసియా మిడిల్ ఈస్ట్ కోసం జీబీసీఐ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణ పద్మనాభం చేతుల మీదగా ఈ అవార్డును చాలెట్ హోటల్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజయ్ సేథితో కలిసి అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థలో అన్ని విభాగాలలో మహిళలు బాధ్యతతో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుతూ భూమికి హాని చేయకుండా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

'బంజారా, లంబాడీల అభివృద్ధికి కృషి'

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బంజారాలు, లంబాడీల అభివృద్ధి, సంక్షేమానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని ఆల్ ఇండియా బంజారాసేవా సంఘ్ (ఏఐబీఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ అన్నారు. ఏఐబీఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘ్ నాయకులతో కలిసి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తండాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, 500 జనాభా ఉన్న తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కులగణనపై సీఎం ప్రకటనను స్వాగతిస్తున్నాం


అభివాదం చేస్తున్న పోరాట సమితి నాయకులు

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులగణన చేపడతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరా ట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం మోచి అన్నా రు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి నాయకులతో కలిసి మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మాల, మాదిగ ఉపకులాలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. కులగణనతోనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, రామారావు, శ్రీనివాసరావు, నాగయ్య స్వామి, పరమేశ్వర్, నాయకులు సతీష్, అశోక్, బలరాం, శివ కుమార్ పాల్గొన్నారు.

'టీఎస్ఎస్పీడీసీఎల్ తాత్కాలిక డైరెక్టర్ల నియామకాల్లో బీసీలకు అన్యాయం'

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్పీడీసీఎల్‌లో తాత్కాలిక డైరెక్టర్ల నియామకాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రజా తెలంగాణ చైర్మన్ ప్రొ.మురళీ మనోహర్, కన్వీనర్ దేవల్ల సమ్మయ్య అన్నారు. మంగళవారం డిస్కంలో నలుగురుకి డైరెక్టర్లుగా నియమిస్తే సీనియర్ అయిన ఓ బీసీ సీజీఎంకు డైరెక్టర్ బాధ్యతలు అప్పగించలేదన్నారు. అర్హతలున్నా అన్యాయం చేశారని దీన్ని ప్రజా తెలంగాణ తీవ్రంగా ఖండిస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవల్ల సమ్మయ్య మాట్లాడుతూ.. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 50 శాతానికి తగ్గకుండా అవకాశం కల్పించాలని మంత్రులను కోరినా స్పందన లేదన్నారు. ఇవే పరిస్థితులు రాష్ట్రంలో కొనసాగితే ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో నిరసన చేపడుతామన్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్‌లో బీసీ అధికారులకు జరిగిన అన్యాయాన్ని డిప్యూటీ సీఎం, బీసీ శాఖ మంత్రుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. డిస్కం సీఎండీ తాత్కాలిక డైరెక్టర్ల నియామకాలపై పునరాలోచించి బీసీలను న్యాయం చేయాలన్నారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి సహకరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చర్లపల్లి, సికింద్రాబాద్, మౌలాలీ రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేస్టేషన్లపై అధిక భారం పడుతోందని.. ఈ సమస్యకు పరిష్కారంగా నగర పరిధిలోని చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద కొత్త టెర్మినల్‌ను అభివృద్ధి చేయాలని భారతీయ రైల్వే సంకల్పించిందని లేఖలో పేర్కొన్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెలుపల ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలు రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించటానికి వీలుగా అప్రోచ్ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పార్కింగ్ తదితర అవసరాల కోసం స్టేషన్‌కు ఇరువైపులా అవసరమైన అదనపు భూమిని రాష్ట్రప్రభుత్వం కేటాయించాల్సి ఉందని తెలిపారు. చర్లపల్లి స్టేషన్ కొత్త బిల్డింగ్ వైపు 3 ఎకరాలు, ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాం వైపు 2.7 ఎకరాల అదనపు భూమిని పార్కింగ్ అవసరాలకు కేటాయించాల్సి ఉందన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు టెర్మినల్ చేరుకోవడానికి రహదారి చాలా ఇరుకుగా ఉందని.. ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలుగా ఆల్ఫా హోటల్ నుంచి రేతిఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరణకు సహకరించాలని సీఎంకు కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ గోపీచంద్ మన్నం

సీఎంను కలిసిన స్టార్ ఆస్పత్రి ఎండీ

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టార్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గోపీచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గూడపాటి రమేష్ మర్యాదపూర్వంగా కలిసి అభినందించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

ఘనంగా శతచండీయుత మహాకుంభాభిషేకం

అమీర్‌పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో చతచండీయుత మహాకుంభాభిషేకం మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారు. ఈ ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఈవో కుంట నాగరాజు వెల్లడించారు. ఉత్సవాలు ప్రారభమై మంగళవారం నాటికి నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వేదపండితులు. రుత్వికులు ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అవివాహిత మండపపూజ, 8.30 గంటలకు దేవతాపూజలు, చండీ హోమం, శతచండీ పారాయణం 12 గంటలకు తీర్థ ప్రసాద వినియోగం రాత్రి 8 గంటలకు క్షేత్రపాలక నవగ్రహా, సర్వతోభద్రమండపాల దేవతా హోమంలు నీరాజన మస్త్రపుష్పం నిర్వహించారు. బుధవారం టీజీవో జిల్లా అధ్యక్షుడు మన్నేబోయిన కృష్ణయాదవ్ ఈవో నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్, ధర్మకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు శంకర విజయేంద్ర సరస్వతి రాక

బుధవారం నిర్వహించే శతచండీయాగసహిత మహాకుంభాభిషేకాని జగద్గురువు ఆదిశంకరాచార్య, కంచికామకోఠి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి విచ్చేయనున్నట్టు ఈవో తెపాఆరు. స్వామి వారిచే రాజగోపురం ఇతర ఉప ఆలయాల శిఖరములకు, కళశాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తున్నామని తెలిపారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న కృష్ణయాదవ్, ఈవో నాగరాజు



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (రూప్) అధ్యక్షుడు అబ్దుల్లా తదితరులు

కోదండరామ్‌కు అభినందనలు

బౌద్ధనగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (రూప్) అధ్యక్షుడు అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ ఇస్లామియా హైస్కూల్ ఫర్‌బాయ్స్ ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ సబీర్ పాషా, కోశాధికారి శర్మ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బౌద్ధనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌డీ ఏ, సీ పాత్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు మహిళలకు ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి సమస్యలు రాకుండా మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపాత్ ల్యాబ్స్ సంస్థ సీఈఓ రంజని చక్రవర్తి, గైనకాలజిస్ట్ ఉమాదేవి, ఐఆర్‌డీఏ అధ్యక్షుడు పి.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికమంత్రికి ఎన్‌ఎఫ్ఐఆర్ ప్రతిపాదనలు

చిలకలగూడ,జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గురువారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో రైల్వేకి సంబంధించిన ప్రతిపాదనలను ఇండియన్ రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఆర్థిక శాఖ మంత్రికి లేఖ రాశారు. భారతీయ రైల్వేలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకి ఆదాయపు పన్ను పరిమితి 12లక్షల వరకు పెంచాలని, స్తంభింప చేసిన మూడు విడతల బకాయిలు విడుదల చేయాలని, 15సంవత్సరాలకి బదులు 12సంవత్సరాలకి కమ్యూటెడ్ పెన్షన్ పునరిద్ధరించాలని, కోవిడ్ సమయంలో విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల మేరకు 65సంవత్సరాలు దాటిన పెన్షనర్లకి అధిక పెన్షన్ చెల్లించాలని కోరారు.



గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతో పాటు నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మను కలిసిన నర్సులు

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నర్సులు పదోన్నతి పొందిన సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతోపాటు నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో నర్సులు సబితారెడ్డి, లక్ష్మి, ఇందిర, ధనలక్ష్మి, సరళ ఉన్నారు.

రేపటి నుంచి హరికథా మహోత్సవం

రవీంద్రభారతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కళాపోషకుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హరికథా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మద్దాళి రఘురామ్ తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నగరంలోని నల్లకుంట శృంగేరి మఠం వేదికగా ఈ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మొదటి రోజు డా.సప్పాభారతి శివలీలలు హరికథా గానం, తార్వత రోజుల్లో ఎర్రా శ్రీనివాస్-గజేంద్రమోక్షం, ఆర్.రేఖ-వినాయక విజయం, మడమల రాంబాబు - మహా కవికాళిదాసు, జల్లా విశ్వనాథ జయరాములు - శ్రీనివా కళ్యాణం, జె.జె.నారాయణ - భక్త మార్కండేయ, గరిమెళ్ల సత్యవతిచే సీతారామ కళ్యాణంహరికథాగానం చేయనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు హరికథ గానం ప్రారంభమవుతుందని రఘురామ్ తెలిపారు.



అరుంధతి సేవా సంఘం అధ్యక్షుడిగా అడ్డగుట్టకు చెందిన మొగిలిపాక శివశంకర్, ప్రధాన కార్యదర్శి మేడి నర్సింగ్, ఉపాధ్యక్షుడిగా సుంచు సతీష్, కోశాధికారి బలరాజులకు సత్కారం. - అడ్డగుట్ట,ఆంధ్రజ్యోతి

ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతరపై అవగాహన

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ మేడారం జాతరపై అవగాహన కార్యక్రమాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బోడ నాగేశ్వర్‌రావు నిర్వహించారు.



వారాసిగూడ చౌరస్తాలో డ్రైనేజీ పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి డీజీఎం కృష్ణ తదితరులు

మ్యాన్‌హోల్స్ లీకేజీ కాకుండా చర్యలు

- డీజీఎం కృష్ణ

బౌద్ధనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ లీకేజీ కాకుండా తగిన చర్యలు చేపట్టామని మారేడుపల్లి జలమండలి డీజీఎం కృష్ణ తెలిపారు. మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో వారాసిగూడ, బ్రాహ్మణబస్తీ, ఉప్పరబస్తీలో జరుగుతున్న మ్యాన్‌హోల్స్, డ్రైనేజీ పైపులైన్, మంచినీటి పైపులైన్ నిర్మాణపనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ పనులు పూర్తైతే కలుషిత జలాలను నివారించవచ్చునని, మ్యాన్‌హోల్స్ లీకేజీ కావని డీజీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహాత్ముడికి పుష్పాంజలి



సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్, కొశికె కిరణ్మయి కిషోర్, నామన శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు. రాంగోపాల్‌పేట్, బౌద్ధనగర్, అడ్డగుట్ట ప్రాంతాలలో గాంధీ విగ్రహాలకు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం - ఆంధ్రజ్యోతి



చిలకలగూడలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, నాయకులు కరాటేరాజు తదితరులు



గాంధీ విగ్రహానికి నివాళర్పిస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు కార్యక్రమంలో ఆర్ఎంఓ 1 డాక్టర్ జయకృష్ణ, వివిధ విభాగాధిపతులు



ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బేగంపేట్ కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కలాసిక సురేష్



ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్, రజనీప్రియ, నాగరాజ్, సంధ్య, విక్రాంత్ మణి తదితరులు

‘ప్లే ఫర్ మల్కాజిగిరి’ పోస్టర్ ఆవిష్కరణ

- క్రీడలకు ప్రాధాన్యతనిచ్చిన ఘనత మోదీ సర్కారుదే
- మల్క కొమరయ్య

సికింద్రాబాద్, మారేడుపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని గత ప్రభుత్వాలు క్రీడలను పెద్దగా పట్టించుకోలేదని, అయితే నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు దేశవ్యాప్తంగా క్రీడలకు పెద్ద పీట వేసిందని బీజేపీ నాయకులు మల్క కొమరయ్య అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈనెల 31న ‘ప్లే ఫర్ మల్కాజిగిరి’ పేరిట నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను మంగళవారం మహేంద్రహిల్స్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రీడా సదుపాయాల పెంపునకు, క్రీడా వ్యాప్తికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని తెలిపారు. దీనిలో భాగంగానే ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా నినాదంతో ముందుకు సాగుతున్నట్టు పేర్కొన్నారు. మోదీ కృషితో ఆసియా క్రీడల్లో, ఒలంపిక్స్‌లో అనేక పతకాలను సాధించగలిగారని, అనేకమంది మహిళలు క్రీడల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. మోదీ స్ఫూర్తితో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో క్రీడా వసతుల పెంపు, క్రీడాకారులను ప్రోత్సహించడంపై దృష్టి సారించినట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులకు సదుపాయాల కల్పనకు కృషిచేస్తామని, అవసరమైన పక్షంలో వ్యక్తిగతంగా ముందుకు వస్తామని కొమరయ్య వివరించారు. ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చని, ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొనాలని, దేహదారుఢ్యం పట్ల దృష్టి సారించాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు.



ప్లే ఫర్ మల్కాజిగిరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు మల్కకొమరయ్య

సిప్ అబాకస్‌లో సత్తాచాటిన తోక వివేక్

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో జరిగిన జాతీయ రాష్ట్ర స్థాయి సిప్ అబాకస్ అర్థమెటిక్ జీనియస్ కంటెస్ట్‌లో కొంపల్లిలోని సాధువాస్వాని ఇంటర్నేషనల్ హైస్కూలులో 2వ తరగతి చదువుతున్న తోక వివేక్ రెండవ తరగతి విభాగంలో సత్తా చాటాడు. దేశంలోని 20 రాష్ట్రాల నుంచి 6 లక్షల మందికి పైగా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన తోక వివేక్ చాంపియన్‌గా మొదటి స్థానంలో నిలిచి సిప్ అబాకస్ నుంచి రూ.10వేలు బహుమతితో పాటు ట్రోఫీని అందుకున్నాడు. అనంతరం చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో కేవలం 10 నిమిషాల్లో 300 లెక్కలు చేయాల్సి ఉండగా హోరా హోరిగా సాగిన ఈ పోటీలో తోక వివేక్ 4వ స్థానంలో నిలిచారు. బాలుడు 2వ తరగతి విభాగంలో 4వ రన్నరప్ ట్రోఫీని గెలుచుకున్నారు. అబాకస్‌లో మంచి నైపుణ్యం సాధించిన వివేక్‌ను సిప్ అబాకస్ ఎండీ దినేష్ విక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



సిప్ అబాకస్‌లో సత్తాచాటిన తోక వివేక్



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్-2024 డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య

విద్యుత్ ఉద్యోగులు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, వినియోగదారులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ-2024 డైరీని సచివాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 24గంటలు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను ప్రజలకు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సంస్థలు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అశోక్, ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, నాయకులు నాసర్ షరీఫ్, పరమేష్, స్వామి, అనిల్, అనురాధ, మురలయ్య, వెంకటేశ్వర్లు కొరడాల, వీరస్వామి, ప్రసాద్, మధు, నాగరాజు పాల్గొన్నారు.

కులగణనపై సీఎం ప్రకటనను స్వాగతిస్తున్నాం

- బైరి వెంకటేశం మోచి

పంజాగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులగణన చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి నాయకులతో కలిసి మాట్లాడారు. ఎస్సీ ఉపకులాల కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మాల, మాదిగ ఉపకులాలకు మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. కులగణనతోనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, రామారావు, శ్రీనివాసరావు, నాగయ్య స్వామి, పరమేశ్వర్, నాయకులు సతీష్, అశోక్, బలరాం, శివ కుమార్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు



అగ్నిప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

షార్ట్ సర్క్యూట్‌తో ప్రైవేట్ బస్సు దగ్ధం

జీడిమెట్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పార్కుచేసిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు అంటుకుని బస్సు దగ్ధమైంది. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణహాని కాలేదు. సూరారం ఆర్‌కే ట్రాన్స్‌పోర్టుకు చెందిన బస్సులను షాపూర్‌నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని హెచ్ఎంటీ స్థలంలో పార్కింగ్ చేస్తుంటారు. మంగళవారం ఉదయం ఒక్కసారిగా బస్సు నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో వారు రాకపోవడంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల బస్సులో బ్యాటరీ మార్చారని, దానికి నూతన వైరింగ్ చేసినట్టు యాజమాన్యం చెప్పిందిన, తాము ఎలాంటి కేసు పెట్టమని యాజమాన్యం చెప్పినట్టు వెల్లడించారు. మంటలను అదుపు చేయకపోయినట్టయితే పక్కనే ఉన్న మరో ఐదు బస్సులు కూడా కాలిపోయి ఉండేవని అధికారులు తెలిపారు. మంటలు అదుపు కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గౌరీసతీష్, విష్ణువర్ధన్‌రెడ్డి

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌరీ సతీష్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోఎన్నికల అధికారులు వరదరాజు, డాక్టర్‌శ్రావణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, అప్సర్‌ఖాన్‌ల పర్యవేక్షణలో అసోసియేషన్ కార్యదర్శుల ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గౌరసతీష్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ట్యూషన్ ఫీజులు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



అధ్యక్ష, కార్యదర్శులుగా గౌరీసతీష్, విష్ణువర్ధన్‌రెడ్డి

కొన్ని రైళ్ల రద్దు, మరి కొన్ని రైళ్ల క్రమబద్ధీకరణ

సికింద్రాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సౌత్ వెస్టర్న్ రైల్వే పరిధిలోని కొప్పల్-గినిగెరా స్టేషన్ల మధ్య లైన్ బ్లాక్ కారణంగా ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్టు, మరికొన్ని రైళ్లను క్రమబద్ధీకరిస్తున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఫిబ్రవరి 2వ తేదీన బయల్దేరవలసిన నర్సాపూర్- ఎస్ఎస్ఎస్ హుబ్బళి (నెంబర్: 17225) రైలు రద్దు, ఫిబ్రవరి 3వ తేదీన బయల్దేరవలసిన ఎస్ఎస్ఎస్ హుబ్బళి -నర్సాపూర్ (నెంబర్: 17226) రైలు రద్దు, ఫిబ్రవరి 3వ తేదీన బయల్దేరవలసిన ఎస్ఎస్ఎస్ హుబ్బళి- గుంతకల్ (నెంబర్: 07337) రైలు రద్దు, ఫిబ్రవరి 3వ తేదీన బయల్దేరవలసిన గుంతకల్-ఎస్ఎస్ఎస్ హుబ్బళి (నెంబర్: 07338) రైలు రద్దు, ఫిబ్రవరి 3వ తేదీన బయల్దేరవలసిన బెల్గావి - కాజీపేట్ (నెంబర్: 07335) రైలు రద్దు, ఫిబ్రవరి 4వ తేదీన బయల్దేరవలసిన కాజీపేట్- బెల్గావి (నెంబర్: 07336) రైలు రద్దు, తిరుపతి-ఎస్ఎస్ఎస్ హుబ్బళి (నెంబర్: 07657) రైలును 120 నిమిషాలపాటు క్రమబద్ధీకరించారు. విజయపురా - యశ్వంత్‌పూర్ (నెంబర్: 06546) రైలును 120నిమిషాలపాటు రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

పంజాగుట్ట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని, లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆయన ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల కాంతం హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకుడు డాక్టర్ సంజీవ్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరుతో వేలకోట్లు దోచుకొన్నారని ఆరోపించారు. ప్రజలు కలిసికట్టుగా పోరాటం చేస్తేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ పేరు మీద పార్టీ పెట్టుకుని పబ్బం గడిపి పదవులు అనుభవించారన్నారు.

గాంధీ ఉద్యోగులకు హెపటైటిస్ వ్యాక్సిన్

అడ్డగుట్ట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పారిశుధ్య కార్మికులు వైద్యులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్ టీకాలు వేస్తున్నట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. జీవన్ హెల్త్ కేర్, సికింద్రాబాద్ రోటరీ క్లబ్, గాంధీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. వైద్యులతో పాటు ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తున్న అన్ని రంగాల్లో ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు వైద్యులు, వార్డు బాయిల దగ్గరి నుంచి టీకాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ టీకా వల్ల ఉద్యోగుల శక్తి పెరుగుతుందని వివిధ రుగ్మతలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమంలో జీవన్ హెల్త్ కేర్ డైరెక్టర్ పార్థసారథి, అశ్విన్‌లు పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై దాడి కేసులో .. నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష



కేరెల్లి యాదిరెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో నిలబడిన ప్రయాణికుడిపై దాడికి పాల్పడిన నిందితుడికి సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో 2023 ఫిబ్రవరి 22న ఓ ప్రయాణికుడు రైలు కోసం నిలబడి ఉండగా కేరెల్లి యాదిరెడ్డి(33) అనే వ్యక్తి ప్రయాణికుడిని రాయితో కొట్టి డబ్బులు లాగేసుకున్నాడు. బాధితుడు వికారాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. అనంతరం కేసు కొనసాగుతుండగా కేసు చివరి దశకు రావడంతో పూర్తి సాక్ష్యాధారాలతో రైల్వే పోలీసులు సికింద్రాబాద్ రైల్వే కోర్టులో కోర్టు కానిస్టేబుల్ విజయ్‌తోపాటు ఉన్నతాధికారులు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విన్న రైల్వేకోర్టు న్యాయమూర్తి గౌస్‌పాషా, ప్రాసిక్యూటర్ రోజారాణిలు నిందితుడికి రూ.10వేలు జరిమాన, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

వృద్ధుడి అదృశ్యం



ఎన్.పిచ్చయ్య

మారేడ్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... గుంటూరు జిల్లా పేరిచర్ల గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి ఎన్.పిచ్చయ్య (72) ఈనెల 26వ తేదీన గుంటూరు నుంచి బయలుదేరి నగరంలోని కౌకూర్‌లో నివాసం ఉంటున్న తన బంధువుల ఇంటికి వెళ్ళడానికి జేబీఎస్‌కు వచ్చాడు. బంధువుల ఇటికి పిచ్చయ్య చేరలేదని సమాచారం అందుకున్న గుంటూరులో ఉంటున్న ఆయన కుమారుడు శివశంకర్ కుమార్ మారేడ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

వాహనాల దొంగ అరెస్ట్

ఒక ఆటో, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

ఏఎస్‌రావునగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న ఓ పాత నేరస్థుడిని మంగళవారం కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. మౌలాలి హెచ్‌బీ కాలనీ ఎన్టీఆర్ విగ్రహ చౌరస్తాలో వాహనాల తనిఖీలో భాగంగా పట్టుబడ్డ అతడి నుంచి రూ.3.5లక్షల విలువైన నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ మహేష్, డీఐ సాయి ప్రకాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ సాయినగర్ కాలనీకి చెందిన రాకోలు భాను చందర్(22) వృత్తిరీత్యా సెంట్రింగ్ కార్మికుడు జల్సాలకు, తాగుడుకు అలవాటుపడ్డ భాను చందర్ వాహనాలను చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలను నకిలీ తాళాలతో రాత్రివేళలో దొంగిలించడం మొదలు పెట్టాడు. 2021 సంవత్సరంలో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆటోను దొంగిలించిన కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. అయినా తీరు మార్చుకోలేదు. కుషాయిగూడ, మల్కాజిగిరి, లాలాగూడ, మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. నిందితుడి నుంచి ఒక ప్యాసింజర్ ఆటో (టీఎస్10యుఏ0324), నాలుగు ద్విచక్ర వాహనాలు (టీఎస్11ఇపి0742) (ఏపి10ఎఎక్స్ 59240), (ఏపీ29ఎఎ9572), (ఏపీ11ఎఎన్ 7949) నంబర్లు గల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.